క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు పంపిణీ



మాచర్ల: పట్టణంలోని పారిశుద్ధ్య కార్మికులకు దసరా పండుగ సందర్భంగా నూతన వస్త్రాలను పురపాలక సంఘ చైర్మన్ పోలూరి నరసింహారావు, ఆర్యవైశ్య నాయకుడు కంభంపాటి అనిల్‌లు అందజేశారు. సోమవారం 100 మంది కార్మికులకు నూతన వస్త్రాలు అందజేశారు. కంభంపాటి అనిల్ సౌజన్యంతో కార్యక్రమం నిర్వహించామని, రాబోయే రోజుల్లోనూ ప్రతి కార్మికుడికి ప్రయోజనం కల్పించేలా చర్యలు తీసుకొని సౌకర్యాలు కల్పించేలా తన వంతు కృషి చేస్తామని చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

పలువురు ఉద్యోగులు బాధ్యతల స్వీకారం

మాచర్ల రూరల్: ఉద్యోగుల సాధారణ బదిలీలలో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో పలువురు ఉద్యోగులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా గుంటా వెంకటరమణ బాధ్యతలు స్వీకరించారు. ఈమె గురజాల ఆర్డీఓ ఆఫీసులో పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న షేక్ బాషా వెల్దుర్తి మండలానికి వెళ్లారు. ఎన్నికల సీనియర్ అసిస్టెంట్‌గా చేవూరి రామాంజనేయులు నియమితులయ్యారు. ఈయన గురజాల ఆర్డీఓ ఆఫీసులో పనిచేస్తూ ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న షేక్ మస్తాన్‌వలి వెల్దుర్తి మండలానికి వెళ్లారు. కొత్తపల్లి వీఆర్‌ఓగా షేక్ ఖాజావలి నియమితులు కాగా ఈయన దాచేపల్లి మండలం మాదినపాడు వీఆర్‌ఓగా పనిచేస్తూ ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు వారు తహసీల్దార్ ఎండీ జియా ఉల్‌హక్‌కు నియామక ఉత్తర్వులు అందించి విధుల్లో చేరారు.

మాచర్లలో చిరుజల్లులు

మాచర్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సోమవారం రాత్రి పట్టణంలో చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి రాత్రి వరకు పలు దఫాలుగా చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. అల్పపీడనం నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ దూళిపాళ్ళ వేణుబాబు పురపాలక సంఘ అధికారులతో సమీక్షించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత సూచించారు. పురపాలక సంఘ అధికారులందరూ అందుబాటులో ఉండాలని ఆయన కోరారు.

పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలి



బెల్లంకొండ: అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజ తెలిపారు. సోమవారం వెంకటాయపాలెం గ్రామంలోని ఎస్టీ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పౌష్టికాహార పదార్థాలను అందించాలని, ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని సూచించారు. ఆమె వెంట గ్రామ సర్పంచ్ ముఖ్య నాగమ్మ బాయి, శ్రీను నాయక్, నాయకులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోండి




ముప్పాళ్ళ(సత్తెనపల్లి): పట్టణంలోని శ్రీనివాస మహల్ థియేటర్ పక్కన నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్న కట్టడాన్ని నిలుపుదల చేయాలని పట్టణంలోని 11 వార్డు కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్ సోమవారం నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు.. సినిమాహాలుకు తూర్పుగా ఉన్న స్థలంలో గ్రౌండ్ ఫ్లోర్, అప్పర్ ఫ్లోర్ నిర్మాణానికి గాను మట్టా సుబ్రమణ్యేశ్వరరావు బిల్డింగ్ ఆర్డర్ పొందాడు. నిబంధనలకు విరుద్ధంగా స్థలంలో 15 అడుగుల లోతు మట్టిని తీసి సెల్లార్ పార్కింగ్ నిర్మాణ పనులు జరుపుతున్నాడు. అధికార పార్టీ నాయకుల అండతో నిర్మాణాలు జరుపుతూ రెండు వైపులా ఉన్న బజారులలో రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నాడు. జిల్లా కలెక్టర్ మున్సిపల్ ప్లాను కు విరుద్ధంగా నిర్మాణం జరుపుతున్న కట్టడాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ ఫిర్యాదు అందించారు.

ధరల అదుపులో విఫలం..

కందిపప్పు భారం

- చుక్కలు చూస్తున్న కందిపప్పు ధర
- రేషన్ దుకాణాల్లో బియ్యం మాత్రమే సరఫరా
- అరకొరగానే కందిపప్పు
- తీవ్ర అవస్థలు పడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలు



రూ.140	రూ.70
మార్కెట్‌లో కందిపప్పు ధర	రేషన్ దుకాణాల్లో ధర

గురజాల: పేద, మధ్య తరగతి ప్రజలకు పప్పన్నమూ కష్టమే అన్నట్లుగా ఉంది పరిస్థితి. బయటి మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలను అంటుతున్నాయి. ఉప్పు నుంచి పప్పు వరకు ధరలు భారీగా పెరిగిపోయాయి. ధరలను అదుపు చేస్తామని, నిత్యావసర వస్తువులు రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తామని ప్రకటనలు గుప్పించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీల అమలులో విఫలం కావడంతో ప్రజలపై భారం పెరిగిపోతుంది. పరిస్థితి ఇలా ఉంటే ఏ కొంటాం...ఏం తింటామని జనం నిట్టూరుస్తున్నారు.

రేషన్ దుకాణాల పటిష్టం ఎక్కడ..?

ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు రేషన్ దుకాణాలను పటిష్టం చేస్తామని ప్రకటించారు. ఉప్పు నుంచి పప్పు వరకు తక్కువ ధరకే నిత్యావసర సరుకులు అందిస్తామని హామీలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఆ దిశగా చర్యలు మాత్రం చేపట్టడం లేదు. అధికారంలోకి రాగానే రాయితీపై ముందుగా కందిపప్పు ఇస్తామని హామీ ఇచ్చారు. దశల వారీగా పామాయిలు, గోధుమపిండి తదితర సరుకులు పంపిణీ చేస్తామని చెప్పారు. వంట నూనె, గోధుమపిండి సంగతి దేవుడెరుగు.. కందిపప్పును సైతం అందించడం లేదు. ఈ నెల మాత్రం అరకొరగా అందించి చేతులు దులుపుకొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ధరలు పెరిగినప్పుడు పేదలకు సాంత్వన చేకూర్చేందుకు గాను రైతు బజార్లు, రేషన్ డిపోల ద్వారా రాయితీపై వంట నూనె, కందిపప్పు, శనగపప్పు పంపిణీ చేశారు. ధరలు పెరిగిన సమయంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రేషన్ పంపిణీ దుకాణాల ద్వారా రాయితీపై కేజీ రూ.67లకే అందించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ విధమైన చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ధరల అదుపులో కూటమి విఫలం..

గురజాల నియోజకవర్గంలో నాలుగు మండలాలు ఉన్నాయి. సుమారుగా గురజాలలో 38, దాచేపల్లిలో 42, మాచవరంలో 38, పిడుగురాళ్ల 79 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అదేవిధంగా గురజాలలో 21,396, దాచేపల్లిలో 22,689, మాచవరంలో 16,271, పిడుగురాళ్లలో 44,020 రేషన్ కార్డుదారులున్నారు. ఇంటింటికీ తిరిగి రేషన్ పంపిణీ చేసేందుకు గాను గత ప్రభుత్వం హయాంలో గురజాలలో 14, దాచేపల్లిలో 15, మాచవరంలో 11, పిడుగురాళ్లలో 24 మినీ వ్యాన్ల ద్వారా చురుగ్గా పంపిణీ చేపట్టింది. సరుకులు నేరుగా ఇంటి వద్దనే ఇవ్వడం, నాణ్యమైన బియ్యం సరఫరా చేశారు. కానీ నేడు ఆ వాహనాలను తొలగించి పాత విధానంలో రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి క్యూలో గంటల తరబడి వేచి ఉంచి రేషన్ తెచ్చుకునే విధంగా చర్యలు చేపడుతున్నారు. అదీనూ కేవలం బియ్యం మాత్రమే అందజేసి చేతులు దులుపుకొంటున్నారు. అక్టోబర్ నెలలో కందిపప్పు కొందరికి మాత్రమే అందించారు. అరకొరగా పంపిణీ చేయడంతో రేషన్ కార్డు దారులు కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కందిపప్పు, వంట నూనెల ధరలు అందనంత ఎత్తులో ఉండి.. సామాన్యుడి నడ్డి విరిస్తున్నా.. ధరలు అదుపుచేసి పేదలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడంతో పేదలు దిక్కుతోచని స్థితిలో మిగిలారు. కూటమి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్రీవెన్స్ సెల్‌కు ఆరు అర్జీలు

మాచర్ల రూరల్: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అధికారులంతా కృషి చేయాలని తహసీల్దార్ ఎండీ జియా వుల్‌హుక్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని జమ్మలమడక, కొత్తపల్లి, కొప్పునూరు, కంభంపాడు గ్రామాలకు చెందిన రైతులు, తమ పొలాలకు చెందిన రికార్డులలో మార్పుల చేర్పులపై అర్జీలందించారన్నారు. తమకు పింఛన్ అందించాలంటూ చర్మకారుల సంఘం నాయకులు జెట్టిపాలెం వెంకటేష్ జాంబవరాజు, తమ పూర్వీకులకు చెందిన భూమిలో హద్దులు చూపాలంటూ శ్రీనివాసరావులు వినతి పత్రాలు అందించారన్నారు. మొత్తం 6 అర్జీలు అందినట్లు తెలిపారు.

అల్పపీడనం ప్రభావంపై అప్రమత్తం..

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణితో మండలంలోని పలు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ అధికారులు పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అందుబాటులో ఉండాలని కోరినట్లు చెప్పారు. ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం పడే నేపథ్యంలో రైతులు సురక్షిత ప్రాంతాలలో ఉండాలని, వ్యవసాయాధికారులు, రైతులకు తగు సలహాలు, సూచనలు అందిస్తూ పంట నష్టం నివారణకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ళ వేణుబాబు, ఎంపీడీఓ ఫణీకుమార్ నాయక్, సీడీపీఓ, అంగన్‌వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

విజయవంతంగా 'టుబాకో ఫ్రీ స్కూల్'



ప్లకార్డులు చూయిస్తున్న విద్యార్థులు

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో సోమవారం 'టుబాకో ఫ్రీ స్కూల్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవి నాయక్ మాట్లాడుతూ పొగాకు వాడకం ఎంతో హానికరమని అన్నారు. పొగాకు తాగినా, పీలినా, నమిలినా, క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయన్నారు. విద్యార్థులు పాఠశాల, ఇంటి పరిసర ప్రాంతాలలో పొగాకు వలన కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కలిగించి, చైతన్య పరచాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులచే పొగాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అదే విధంగా విద్యార్థులచే నినాదాలు చేయించి, ప్లే కార్డులు ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఉచిత వినికిడి పరికరాల కోసం 98 మంది దరఖాస్తు

నరసరావుపేట: పాత గవర్నమెంట్ హాస్పిటల్‌లోని జిల్లా సత్వర చికిత్స కేంద్రం (డీఇఐసీ)లో నేషనల్ ప్రోగ్రాం ఫర్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ డెఫ్నెస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉచిత వినికిడి పరీక్షలు, పరికరాల కొరకు దరఖాస్తులు స్వీకరించామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. దీనిలో 98 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. వీరికి త్వరితగతిన వినికిడి మిషన్‌లు అందిస్తామని చెప్పారు.

అప్రమత్తంగా ఉండాలి

నాదెండ్ల: తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 17 వరకూ భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని తహసీల్దార్ ఏవీ రమణ తెలిపారు. తన కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా నాలుగు రోజులపాటూ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు పొంగి ప్రవహించే అవకాశం ఉన్నందున చప్టాల వద్ద రాకపోకలను నియంత్రించాలన్నారు. పురాతన మట్టిమిద్దెలు కూలే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని కోరారు.

సెలవులు ముగిసే.. బస్టాండ్ కిక్కిరిసే!



దసరా సెలవులు ముగియటంతో పిడుగురాళ్ల ఆర్టీసీ బస్టాండ్ ఒక్కసారిగా కిక్కిరిసిపోయింది. గుంటూరు, విజయవాడ, నర్సరావుపేట వంటి ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు, వారిని వదిలిపెట్టడానికి వచ్చిన వారితో సోమవారం బస్టాండ్ ఆవరణ కిటకిటలాడింది. బస్సుల కోసం పరుగులు తీసే జనం, బస్సు వస్తే ఎక్కడానికి ఎదురుచూసేవారితో బస్టాండ్ సందడిగా కనిపించింది.

- పిడుగురాళ్ల

కార్మికులను తొలగించడం అన్యాయం

కలెక్టర్, ఆర్డీవోలను కోరిన సీఐటీయూ నాయకులు



నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

నరసరావుపేట: రాజకీయ కారణాలతో తొలగించిన మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగ ఔట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకొని వారికి రెండు నెలల జీతం బకాయులను చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల ఎదుట ధర్నా చేసి ఆయా కార్యాలయాల్లో వినతిపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ తొలగించబడిన 15మంది కార్మికులు గత పది, పదిహేను ఏళ్ల నుంచి పనిచేస్తున్నారన్నారు. వీరిని అర్ధాంతరంగా విధుల్లోకి రావొద్దని మున్సిపల్ కమిషనర్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వీరికి చెల్లించే జీతాల నుంచి పీఎఫ్, ఈఎస్‌ఐలకు డబ్బులు కట్ చేశారన్నారు. ఇప్పుడు వీరిని ఉద్యోగాలకు రావొద్దని చెప్పి వారి కుటుంబ సభ్యులను మానసిక సంక్షోభానికిగురిచేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ శిలార్, పట్టణ గౌరవాధ్యక్షుడు షేక్ చిన్న అల్లాబక్షు, షేక్ సైదా, బి.నాగమల్లేశ్వరి, ఏ.పద్మ, రమాదేవి, షేక్ మహబూబుబాష పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకం

ఆంగ్ల బోధకుడు నాగేశ్వరరావు



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

శావల్యాపురం: సమాజంలో ఉపాధ్యాయులు పాత్ర చాలా కీలకమైందని శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల సీనియర్ ఆంగ్ల బోధకులు స్టాఫ్ సెక్రటరీ బెజవాడ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మి (రోటరీ క్లబ్ గుంటూరు) జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు కుమ్మరి శ్రీనివాస రాజు, పీడీ రాగుల రాధాకృష్ణ మూర్తిలకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాలతో పాటు సమాజ భాగస్వాములై భావితరాలకు విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు సమాజానికి మార్గదర్శకంగా మెలగాలన్నారు. సామాజిక సేవా భావం కల్గియున్న ఉపాధ్యాయులను ప్రభుత్వం గుర్తించటం అభినందనీయమన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా పూలమాలలు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అనధీకృత పురుగు మందులు స్వాధీనం

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): వడ్డవల్లిలోని అంజనేయస్వామి గుడి ప్రాంతంలోని గొడౌన్‌లో 418 లీటర్లు, రూ.5,85,240లు విలువ చేసే అనధీకృత పురుగుమందు నిల్వలను స్వాధీనం చేసుకున్నట్లు సత్తెనపల్లి ఇన్‌చార్జ్ సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీధర్‌రెడ్డి సోమ వారం తెలిపారు. సమాచారం మేరకు.. వడ్డవల్లి వీఆర్వో అనిల్ ఆధ్వర్యంలో తనిఖీలు జరపగా గొడౌన్ లో పురుగు మందులు నిల్వలు గుర్తించామని అధికారులు తెలిపారు. విచారణ జరపగా నిల్వలు పట్టణంలోని శివశంకర ఫర్టిలైజర్స్ కు చెందిన నిర్ధారించడం జరిగిందన్నారు. ఈ గొడౌన్ సంబంధిత దుకాణానికి జతపరచ లేనందున నిల్వలన్నీ అనధీకృత పురుగుమందులుగా గుర్తించామన్నారు. బీఏఎస్‌ఎఫ్‌కు చెందిన పురుగు మందులు 26లీటర్లుకు గాను రూ. 61,500, బెస్ట్ ఆగ్రో లైఫ్ లిమిటెడ్ కంపెనీకి సంబంధించిన పురుగుమందులు 70 లీటర్లు గాను రూ.1,10,300లు, పీఐ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీకి సంబంధించిన పురుగు మందులు 320లీటర్లుకు గాను రూ.4,13,440లు నిల్వలున్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. సీజ్ చేసిన మందులను భద్రతా చర్యల్లో భాగంగా పట్టణంలోని ఆదిత్య సీడ్స్ పురుగు మందుల దుకాణంలో ఉంచటం జరిగిందన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలో స్టాక్ రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల: రైతులకు ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే వారిపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన రెంటచింతలలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి ఆయన మాట్లాడారు. సీపీలు లేకుండా ఎరువులు, పురుగు మందులు రైతులకు అమ్మడం చట్టప్రకారం నేరమన్నారు. ఎప్పటికప్పుడు షాపులలో ఉన్న ఎరువులు, పురుగు మందుల వివరాలు, క్రయ, విక్రయాలకు సంబంధించి సమాచారం స్టాక్ రికార్డులలో నమోదు చేయాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు, పురుగు మందులకు ఇచ్చే బిల్లులో తేదీ, బ్యాచ్ నంబర్, లాట్ నంబర్ నమోదు చేయాలన్నారు. షాపులో స్టాక్ వివరాల రికార్డు ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రైతులు అడిగిన రసాయనిక మందులను మాత్రమే ఇవ్వాలన్నారు. అనుమతి లేని మందులను, ఎరువులను విక్రయించిన అటువంటి షాపు నిర్వాహకులపై తీవ్రమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యాభివృద్ధికి కృషి అభినందనీయం



విద్యార్థులకు నగదు పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే జేబీఆర్, తదితరులు

మాచర్ల: వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని కోదండ రామాలయంలో యూనివర్సల్ ఫౌండేషన్ ట్రస్టీ ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్, ఎంసెట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి క్యాష్ ప్రైజ్, షీల్డ్‌లు అందించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జేబీఆర్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ప్రైవేటు విద్యకు తల్లిదండ్రులు మొగ్గు చూపటం సరికాదన్నారు. తామంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నతస్థాయికి వచ్చామన్నారు. పలువురు జిల్లా కలెక్టర్లుగా, ఉన్నతాధికారులుగా ఎదిగిన వారున్నారన్నారు. బాలుర, బాలికోన్నత పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తున్నారన్నారు. యూనివర్సల్ ఫౌండేషన్ ట్రస్టీ నిర్వాహకులు ఆవుల వెంకటేశ్వర్లు, ఆంజనేయులు ప్రతిభగల విద్యార్థులకు క్యాష్ అవార్డులు అందించడం అభినందనీయమన్నారు. అనంతం ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలో 10, ఇంటర్, ఎంసెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ఫౌండేషన్ ట్రస్టీ నిర్వాహకులతో కలిసి బహుమతులు అందజేసి వారిని ఎమ్మెల్యే అభినందించారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లిఖార్జునరావు, రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ గాదె రామకృష్ణారావు, ఎస్‌కేబీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉల్లయ్య, హెచ్‌ఎంలు రామారావు, రామకృష్ణ శాస్త్రి, డాక్టర్ రామకోటయ్య, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ళు, టీడీపీ నాయకులు యెనుముల కేశవరెడ్డి, దుర్గారావు తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధికి 'పల్లె పండుగ'



తురకపాలెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

దుర్గి: ప్రభుత్వం ప్రారంభించిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని ఓబులేశునిపల్లె, రాజానగరం గ్రామ పంచాయతీ పరిధిలో పలు సీసీ రోడ్లకు శంకుస్థాపన నిర్వహించారు. ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైన్స్, నిర్మాణాలు చేపట్టటానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఎంపీపీ యేచూరి సాయి శంకర్ అన్నారు. ఓబులేశునిపల్లెలో రూ.15లక్షలతో రాజానగర్, గజాపురంతో రూ. 20లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయన్నారు. రాజా నగర్ సర్పంచ్ జక్కా రమేష్, ఏపీఓ చిన వెంకటేశ్వర్లు, ఏఓ శివప్రసాద్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రెంటచింతల: మండల పరిధిలోని మల్లవరం, జెట్టిపాలెం గ్రామాలలో పల్లె పండుగ వారోత్సవాలలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మంజూరైన పనులకు భూమి పూజా కార్యక్రమాలను సోమవారం నిర్వహించినట్లు ఎంపీడీఓ కె. సరోజినిదేవి తెలిపారు. మల్లవరంలో రూ.10 లక్షలకు, జెట్టిపాలెంలో రూ. 20లక్షల విలువైన పనులకు భూమి పూజా కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. పీఆర్‌ఏఈ వెంకటేశ్వరరెడ్డి, ఏపీఓ జి.జయచంద్రకుమార్, మల్లవరం సర్పంచ్ బాలసైదులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

గురజాల రూరల్ (అంబాపురం): పల్లె పండుగతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చూట్టడం జరిగిందని ఎంపీడీఓ షేక్ గౌసియా బేగం అన్నారు. మండల పరిధిలోని అంబాపురం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చూట్టారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఏపీఓ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

మాచవరం: గ్రామాల అభివృద్ధికి ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని తురకపాలెం. కొత్తపాలెం గ్రామాలో సీసీ రోడ్లకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తురకపాలెం గ్రామానికి రూ.10 లక్షలు, కొత్తపాలెం గ్రామానికి రూ.40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. తహసీల్దార్ క్షమారాణి, ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు, ఏపీఓ వెంకటేశ్వర్లు, టీడీపీ మండల కన్వీనర్ బడిగుంచల వెంకటేశ్వర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్, మైక్‌సెట్ బహూకరణ



తిమ్మాపురం హైస్కూలుకు ప్రింటర్, మైక్‌సెట్ బహూకరిస్తున్న రిటైర్డ్ టీచర్ కాటూరి కృష్ణన్

నాదెండ్ల: తాను పనిచేసిన పాఠశాల అభివృద్ధికి తన వంతుగా సాయమందించటం సంతోషంగా ఉందని ఉద్యోగ విరమణ చేసిన పీఈటీ కాటూరి కృష్ణన్ చెప్పారు. యడ్లపాడు మండలం తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సోమవారం కృష్ణన్, ఆయన సతీమణి రాజేశ్వరి రూ.30 వేలు విలువైన ప్రింటర్, మైక్‌సెట్‌లను పాఠశాలకు బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వెంకటాద్రినాయుడు మాట్లాడుతూ, కృష్ణన్ తన ఉద్యోగ జీవితంలో ఎంతో మంది విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్ది వారి అభ్యున్నతికి విశేషంగా దోహదపడ్డారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పుల్లగూర ప్రభావతి, గ్రామపెద్దలు పావులూరి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ఎలికా రాఘవులు, పాపసాని రాజేశ్వరి, పావులూరి పిచ్చయ్య, చంద్రశేఖర్, పుల్లగూర రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

టౌన్ బాప్టిస్టు చర్చి పాస్టర్ ఎలీషాకు ఘన సన్మానం



నరసరావుపేట: ప్రపంచ పాస్టర్స్ డే సందర్భంగా స్థానిక టౌన్ బాప్టిస్టు చర్చి పాస్టర్ రెవరెండ్ మున్నంగి ఎలీషాను సంఘ విశ్వాసులు ఆదివారం సాయంత్రం చర్చిలో ఘనంగా సన్మానించారు. సంఘ విశ్వాసకులు పంగులూరి విజయ్‌కుమార్ మాట్లాడు తూ గత 17ఏళ్ల నుంచి టౌన్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్‌గా కొనసాగుతూ సంఘ విశ్వాసులు మధ్య ఐక్యమత్యం, సంఘ అభివృద్ధికి తోడ్పడ్డారన్నారు. సంఘ విశ్వాసులు తెలగలపూడి ఆనంద్ బెంజిమెన్, కందుకూరి చిన్న మాస్టర్, నూనె గురవయ్య, జంగాల నవబాబు, తలారి శ్యాము, రాజేంద్ర, లింగయ్య, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.